క్లుప్తంగా

మూలకు చేరిన జనరేటర్



నిరుపయోగంగా ఉన్న జనరేటర్

కిర్లంపూడి: తహసీల్దార్ కార్యాలయానికి ఇచ్చిన జనరేటర్ తుప్పు పట్టి మూలకు చేరింది. సుమారు 15 ఏళ్ల కిందట కిర్లంపూడి కార్యాలయానికి అప్పటి ప్రభుత్వం దీనిని కేటాయించారు. 2–3 సంవత్సరాలు బాగానే పని చేసింది. మెయింటెన్స్ చేయలేక వదిలేయడంతో తుప్పు పట్టి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కరెంట్ లేని సమయంలో ఇన్వేటర్ సహాయంతో ఆఫీస్‌లోని పనులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో నాలుగు కంప్యూటర్లు, మూడు ఫ్యాన్లు, రెండు ప్రింటర్లు నిత్యం ఉపయోగించడంతో ఒక గంటలోపే బ్యాక్లరీ ఆగిపోతోంది. దీంతో అత్యవసర సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని వినయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధురాలికి వినికిడి యంత్రం అందజేత



తునిలో వృద్ధురాలికి వినికిడి యంత్రం అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: చెవులు వినబడని ఓ వృద్ధురాలికి రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆదివారం వినికిడి యంత్రం అందజేశారు. పట్టణానికి చెందిన వృద్ధురాలు భర్త, పిల్లల ఆసరా లేకుండా వినికిడి సమస్యతో కాలం వెల్లదీస్తోంది. విషయం తెలుకున్న రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ సబల ప్రతినిధులు రోటరీ క్లబ్ సహకారంతో వృద్ధురాలికి పరీక్షలు చేయించి వినికిడి యంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ దీపిక, రోటరీ కార్యదర్శి వీర్రాజు, కిషోర్‌రెడ్డి, కృష్ణ, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

తొండంగి: తుపాను ప్రభావంతో ఆదివారం మండలంలో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. కుండపోత వర్షాల అనంతరం రెండు రోజులు పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. కాగా ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై దట్టమైన మబ్బులతో చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈనేపథ్యంలో తీరప్రాంతంలో మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. జి.కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేశారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

తొలకరితో పశువులకు ఊరట



ఉత్తరకంచి పంటపొలాల్లో మేత మేస్తున్న గొర్రెలు

ప్రత్తిపాడు రూరల్: ఎండల తీవ్రతకు పశుగ్రాసం కోసం అల్లాడిన పశువులకు తొలకరి జల్లులు పడడంతో కాస్త ఊరట లభించింది. పొలాలు పచ్చగా కనిపిస్తుండడంతో రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మొదటి వారం నుంచి తొలకరి జల్లులు పడడంతో ఎండిన వ్యవసాయ, బీడు భూముల్లో పసురు చిగురించి కళకళలాడుతున్నాయి. పశువులకు మేత దొరకక అల్లాడిన పశుపోషకులకు ప్రస్తుతం పుష్కలంటా లభిస్తోంది. వ్యవసాయ భూముల్లో ఎక్కడ చూసినా పశువులు, మేకలు, గొర్రెలు మేత మేస్తూ దర్శనమిస్తున్నాయి.

కుక్కలు భౌబోయ్..

- గోకవరంలో కుక్కల బెడద
- నెలలో వంద మందికి పైగా బాధితులు
- పట్టించుకోని అధికారులు



గోకవరంలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

గోకవరం: రోజురోజుకు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైపోతోంది. పగలు రాత్రి తేడా లేకుండా ప్రధాన రహదారి, వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ జనంపై దాడికి దిగుతున్నాయి. వాహనదారులను వెంబడిస్తున్నాయి. కుక్కలకు భయపడి చిన్నపిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారు రాత్రి సమయంలో ఇంటికి వెళ్లే సమయంలో కుక్కలను తప్పించుకోవడం పెద్ద సమస్యగా మారింది. గోకవరం మండలంలో 14 పంచాయతీలు ఉండగా 30 వరకు గ్రామాలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. మండల కేంద్రమైన గోకవరంలో ప్రతి వీధిలోనూ ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. కనిపిస్తున్న వారిపై దాడికి తెగపడుతున్నాయి. అలాగే మేజర్ పంచాయతీ అయిన కొత్తపల్లిలో సైతం కుక్కల బెడదతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు గోకవరం, అచ్యుతాపురం, మల్లవరం గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి పదుల సంఖ్యలో ప్రజలను, పశువులను గాయపరిచాయి.

- గోకవరంలో కొన్నేళ్ల క్రితం చిన్నారులను వీధి కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. నిత్యం ఏదొక గ్రామంలో ప్రజలపై కుక్కల దాడి జరుగుతోంది.
- వీటి బారిన పడి ఒక్క గోకవరం ప్రభుత్వాస్పత్రిలో ఏప్రిల్‌లో 126 మంది బాధితులు చికిత్స పొందగా కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో 50కి పైగా కేసులు నమోదయ్యాయి.
- ఇవే కాకుండా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి, పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న వారు అనేక మంది ఉన్నారు.
- మండలంలో గతంలో రెండు ర్యాబిస్ మరణాలు సైతం సంభవించాయి.
- పదేళ్లలో కొత్తపల్లి, గోకవరం గ్రామాల్లో కుక్కకాటుకు గురై ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.
- రోజురోజుకు కుక్కల బెడద పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలను నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్క కాటుకు గురైతే..

కుక్క కాటుకు గురైన వెంటనే ఆ ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కుళాయి దార వేగంగా పెట్టి శుభ్రం చేసుకుంటే చాలా మంచిది. కుక్క కాటుకు గురైన వారు సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వచ్చి వైద్యం పొందాలి. గాయాన్ని బట్టి తొలుత టీటీ ఇంజక్షన్‌తో పాటు షెడ్యూల్ ప్రకారం ఏఆర్‌వీ డోసులను వేయించుకోవాలి. కరచిన ప్రదేశంలో కుట్లు వేయకూడదు. కరచిన కుక్కను గమనించాలి. అది పిచ్చి కుక్కా, మంచి కుక్కా అనేది తెలుస్తుంది. కుక్కను బట్టి వైద్యం పొందాల్సి ఉంటుంది. ఇంట్లో పెంపుడు కుక్క అయినా వైద్యం కచ్చితంగా పొందాలి. లేకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

– డాక్టర్ రామలక్ష్మి, సూపరింటెండెంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, గోకవరం

మాజీ మంత్రిని కలిసిన ముద్రగడ



తునిలో దాడిశెట్టి రాజా మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

తుని: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ పీఏసీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ పరంగా నిర్వహించే పలు కార్యక్రమాలతోపాటు రాష్ట్ర రాజకీయాలపై చర్చించినట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి జగన్‌ను మరోసారి సీఎం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. కార్యక్రమంలో నరిసే శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

జగ్గంపేట: కాండ్రేగుల గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.5100 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై రఘునందన్‌రావు తెలిపారు.

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా



కోటనందూరులో గొంపకొండ నుంచి గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్

కోటనందూరు: మండలంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. మాఫియా గ్రావెల్ కొండలను పిండి చేసి అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి పైసా పన్ను కట్టకుండా వందల ట్రాక్టర్ల గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి వారికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారుల అండదండలతో దీంతో తమ కత్తికి అడ్డు లేదన్నట్లుగా మాఫియా గ్యాంగు హల్‌చల్ చేస్తోంది. ఆదివారం అధికారులకు సెలవుదినం కావడంతో స్థానిక గొంపకొండ నుంచి వందల ట్రాక్టర్ల గ్రావెల్‌ను తరలించేశారు. ఈ దుస్థితిపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను నడిపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బంటాలను తలపిస్తున్న గ్రామీణ రహదారులు



చామవరం, హంసవరం రోడ్డు గుంతలలో నిలిచిపోయిన వర్షపునీరు



ఎస్.అన్నవరం, చామవరం రోడ్డులో గుంతలు

తుని రూరల్: తుపాను ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో గ్రామీణ రోడ్డు బంటాలను, చెరువులను తలపిస్తున్నాయి. ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతల్లో వర్షపునీరు చేరి రోడ్లు ప్రమాదకరంగా మారాయి. మండలంలో రైల్వే పెద్దగేటు నుంచి చామవరం, హంసవరం వెళ్లే రోడ్డు ధ్వంసమవడం, ఎంపీపీ ప్రాతినిధ్యం వహిస్తున్న చామవరం గ్రామంలో అడుగడుగునా గుంతలు పడడంతో వాహనదారులే కాకుండా స్థానికులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా ఎస్.అన్నవరం నుంచి చామవరం వెళ్లే కిలో మీటరు రహదారి సైతం దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి నుంచి రెండు గ్రామాల్లో మధ్య రాకపోకలే కాకుండ 11 వందల మందికి కేటాయించిన కాలనీలో గృహస్తులు అవస్థలు పడుతున్నారు. అధికారులు., ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ఆయా రహదారుల్లో ప్రయాణించే ప్రయాణీకులు, వాహనదారులు కోరుతున్నారు.

కలుషితమైన తాగునీరు

- డీజిల్ వాసన
- నెల రోజుల నుంచి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఏడీబీ రోడ్డు రామేశంపేటలోని జీఎల్ఆర్ ట్యాంక్

గండేపల్లి: తాగునీరు కలుషితమైంది. తాగునీటి నుంచి డీజిల్ వాసన రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగేందుకు నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామేశంపేటలో రోడ్డును ఆనుకుని ఉన్న జీఎల్ఆర్ ట్యాంక్ నుంచి స్థానికులకు పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా వుతోంది. ఈ నీటి నుంచి కొన్ని రోజులుగా డీజిల్ వాసన వస్తోంది. ఇది గుర్తించిన గ్రామస్తులు పంచాయతీ సిబ్బందికి తెలియజేశారు. అయినా పట్టించుకోవడంలేదు. నీరు డీజిల్ వాసన వస్తోందని తెలిసినా నెల రోజుల నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని వినియోగిస్తున్నారు. దీంతో దురదలు, తలనొప్పితో బాధపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

వాటర్ ట్యాంకు పక్కనే హెచ్‌పీ పెట్రోల్ బంకు

రామేశంపేటలో ఉన్న జీఎల్ఆర్ ట్యాంకును ఆనుకుని పోశిని బాబూరావుకు చెందిన హెచ్‌పీ పెట్రోల్ బంకు ఉంది. బంకుకు సంబంధించిన ట్యాంక్, (పెట్రోల్, డీజిల్ ట్యాంకులు), పైపులైన్ నుంచి డీజిల్ లీకవుతూ జీఎల్ఆర్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న నీటి పైపులైన్‌లో కలుస్తుండడంతో ఈ వాసన వస్తుందేమోనన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. క్లోరినేషన్, డ్రైన్ల క్లీనింగ్ చేయాలన్న ఏ చిన్న అవసరం ఉన్నప్పటికీ సర్పంచ్ అని వేడుకోకపోతే మా సమస్య పరిష్కారం కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో మూడో స్థానం సాధించిన బాలురు, బాలికల జట్లతో సభ్యులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మూడో స్థానం దక్కింది. కర్నూలు జిల్లాలో ఈ నెల 28, 29 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొన్న బాలుర జట్టుకు మూడో, బాలుకల జట్టుకు మూడో స్థానం దక్కింది. జిల్లా టీమ్‌కు కోచ్ మేనేజర్లుగా పీడీ శేషుకుమారి, కె.నాగలింగేశ్వరరావు, వంశీ, కోచ్ పి.లక్ష్మణరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్ మేనేజర్లను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ సభ్యులు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం తదితరులు అభినందించారు.

పడకేసిన పారిశుధ్యం

- ఎక్కడికక్కడే చెత్త
- విచ్చలవిడిగా కుక్కలు, పందుల సంచారం
- పట్టించుకోని అధికారులు



ఏలేశ్వరంలో రహదారిని ఆనుకుని ఉన్న చెత్త

ఏలేశ్వరం: నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడికక్కడేప చెత్తా చెదారం దర్శనమిస్తోంది. తక్కువ సిబ్బందితో ఉన్న గ్రామాలే కొంతలో కొంత పరిశుభ్రంగా ఉంటే నగర పంచాయతీ స్థాయి ఉన్నా కనీసం పరిశుభ్రత లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్వచ్ఛభారత్ పేరుతో ప్రచారంపై ఉన్న శ్రద్ధ పారిశుధ్యంపై లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉండగా ప్రస్తుతం లెక్కల ప్రకారం సుమారు 50 వేల పైగా జనాభా ఉంటారని అంచనా. ప్రతి వార్డులోనూ రహదారులపై, డ్రైన్లల్లో చెత్త కనపించని రోజు లేదంటే నమ్మలేని నిజం. ఉదయాన్నే అధికారులు చెత్త తొలగిస్తున్నట్టు సెల్‌ఫోన్ల ద్వారా ఫొటోలు తీసి యాప్ ద్వారా ఉన్నతాధికారులకు పంపి చేతులు దులుపుకొంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో కుక్కలు, పందుల సంచారం విపరీతంగా పెరిగింది. కుక్కల బెడదతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అక్రమణలకు అధికారుల అండదండలు

పట్టణంలో ఎక్కడ ఖాళీ స్థలం దొరికినా వెంటనే అక్రమ నిర్మాణం చేపట్టవచ్చు అనేది అక్రమార్కులకు అలవాటుగా మారింది. అదే అన్ని అనుమతులు ఉండి లేఅవుట్‌లో నిర్మాణం చేపట్టాలంటే అధికారులు చుక్కలు చూపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లేఅవుట్‌లో నిర్మాణానికి అనేక నిబంధనలను అధికారులు చూపిస్తున్నారు. అదే అక్రమణదారులకైతే రాత్రి చూస్తే పొద్దుటికి నిర్మాణం అయిపోతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు నాయకుల అజామాయిషీలో కాకుండా నిబంధనల ప్రకారం పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత జగ్గంపేట జట్టు



జగ్గంపేటలో షీల్డ్ అందుకుంటున్న జగ్గంపేట జట్టు

జగ్గంపేట: గ్రామ శివారులో ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభించిన కోరాడ సాయిరాం శ్రీనివాస్(గిల్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. టోర్నమెంట్ ఫైనల్స్‌లో జగ్గంపేట జట్టు ఘన విజయం సాధించింది. ఈ ఆటలో మొత్తం వివిధ ప్రాంతాలకు చెందిన 34 టీంలు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కోరాడ సాయిరాం శ్రీనివాస్ జ్ఞాపకార్థం అతని తండ్రి కోరాడ సుబ్బారావు, మిత్ర బృందం, క్రికెట్ అభిమానులు కలిసి ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఫైనల్స్‌లో విన్నర్‌గా నిలిచిన జగ్గంపేట జట్టుకు రూ.25,555 నగదు, షీల్డ్, రన్నర్స్ నిలిచిన గుర్రప్పపాలెం జట్టుకు రూ.15,555 నగదు షీల్డ్, మూడో జట్టుకు రూ 5,555 నగదు షీల్డ్ అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ ప్రముఖుడు మారిశెట్టి భద్రం హాజరై విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కొండ్రోతు పైడియ్య, ప్రేమ స్వరూప్ బుజ్జి, ఆర్గనైజింగ్ టీం ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని సారా స్థావరాలపై ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో దాడి చేసి, 1,800 లీటర్ల బెల్లపు ఊటను, కిర్లంపూడి మండ లం కృష్ణవరంలో 700 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెద్దిపాలెనికి చెందిన బొందల వీర కుమార్‌పై పరారీ కేసు నమోదు చేశారు. ఈదాడిలో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు. ;

2న గొల్లప్రోలులో వైఎస్సార్ సీపీ సమావేశం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



నాయకులతో వంగా గీత

పిఠాపురం: వచ్చే నెల 2వ తేదీ బుధవారం గొల్లప్రోలు సత్యకృష్ణ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమావేశ నిర్వహణపై పార్టీ క్యాడర్‌తో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలతో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామన్నారు. దీనికి పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా నేతృత్వంలో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. దీనికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సంస్థాగత ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ ముఖ్య నేతలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు ప్రజలను మోసగిస్తున్న తీరును ఎలా ఎండగట్టాలనే దానిపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను ప్రభుత్వం మోసగించిందన్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకుని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అయినప్పటికీ ప్రజల తరఫున పార్టీ ఎప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటుందని, దానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే ప్రజలు కూటమి ప్రభుత్వంపై, ఆ పార్టీల నేతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రజలకు అండగా ఉండి వారి తరఫున పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అందరూ కలసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సెల్ టవర్ వద్దంటూ ఆందోళన



సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని ఆందోళన చేస్తున్న పిఠాపురం వెలంపేట ప్రజలు

పిఠాపురం: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలంటూ పిఠాపురం వెలంపేట ప్రజలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సెల్ టవర్ రేడియేషన్ వల్ల మహిళలకు అనేక రుగ్మతలు వస్తున్నాయని అన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్మాణాన్ని ఆపివేయాలని, లేదంటే మరింత తీవ్రంగా ఉద్యమం చేపడతామని మహిళలు హెచ్చరించారు. ఈ విషయంపై పిఠాపురం ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు.

బీచ్ రోడ్డులో వాహన తనిఖీలు



ఉప్పాడ బీచ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆదివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 వాహనాలకు సంబంధించి ఈ చలానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో మద్యం తాగి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్ సిబ్బంది ఉన్నారు.